క్లుప్తంగా

22న మండల సమావేశం

కుభీర్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 22న మంగళవారం కుంటాల మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ తూము లక్ష్మీబాయి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు ఉదయం 11 గంటలకు హాజరు కావాలని కోరారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

సోన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి చేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు అన్నారు. గురువారం మండలంలోని కడ్తాల్, జాఫ్రపూర్, సిద్దులకుంట, పాక్‌పట్ల, మాదాపూర్ పాఠశాలల్లో పీఆర్టీయూ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. శంకర్, శ్రీధర్‌రెడ్డి, కె.భూమారెడ్డి, చంద్రశేఖర్ సాయారెడ్డి పాల్గొన్నారు.

గొర్రెల యూనిట్లు పంపిణీ



గొర్రెలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మహిపాల్

సారంగపూర్: మండలంలోని బీరవెల్లి గ్రామంలో గురువారం 18 మంది లబ్ధిదారులకు ఎంపీపీ మహిపాల్‌రెడ్డి గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు. జిల్లా పశువైద్యాధికారి గంగా.దరయ్య, సర్పంచ్ రవీంద్రనాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, పశువైద్యాధికారులు జమీల్, షేక్ ముక్తార్ తదితరులు ఉన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలి



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

తానూరు: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ గురువారం తానూరు కస్తూరిబాలో పని చేస్తున్న టీఎస్ఎస్ఏ ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. టీఎస్ఎస్ఏ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురు చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు గురువారం మహేశ్వర్‌రెడ్డి నివాసంలో బీజేపీలో చేరారు. ఈ మేరకు వారికి మహేశ్వర్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అభిలాష్, శ్రీనివాస్, అజయ్‌ప్రసాద్ తదితరులు పార్టీలో చేరారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి

కుంటాల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి సూచించారు. గురువారం కుంటాలలో పలు కాలనీల్లో పర్యటించారు. మురికి గుంతల్లో నీటిని నిల్వ ఉంచుకోవద్దని సూచించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి రాజబాపు, సిబ్బంది దిలీప్ ఉన్నారు.

'అవార్డు ఇవ్వడం సరికాదు'

కడెం: స్వాతంత్ర్య దిన వేడుకల్లో అర్హత లేని వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగిని అవార్డుకు ఎంపిక చేయడం సరికాదని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు కె.రాజేశ్ ఆరోపించారు. గురువారం కడెంలో మాట్లాడారు. కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల్లో మారుమూల ప్రాంతాల్లో సేవలందిస్తున్న వైద్య సిబ్బందిని విస్మరించి.. సమ్మె చేస్తున్న రెండో ఏఎన్ఎంకు ఉత్తమ అవార్డు ఇవ్వడం సరికాదన్నారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ నాయకులు గంగయ్య, రవి ఉన్నారు.

బ్యాంకుల వద్ద సందడి



బెల్‌తరోడాలో బారులు తీరిన రైతులు

తానూరు: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసేందే. ఇప్పటివరకు రూ.84 వేల రుణం వరకు మాఫీ అయ్యాయి. అయితే పలువురు తమ రుణమాఫీ వివరాలను తెలుసుకునేందుకు బ్యాంకులకు క్యూ కడుతున్నారు. గురువారం తానూరు, బెల్‌తరోడాలో ఉన్న దక్కన్ గ్రామీణ బ్యాంక్ ఎదుట రైతులు బారులు తీరి కన్పించారు.

రెండేళ్లవుతున్నా పూర్తికాలే..

- నత్తనడకన ఓలా–అంబుగామ రోడ్డు నిర్మాణ పనులు
- రాకపోకలకు ప్రజల ఇబ్బంది
- పట్టించుకోని అధికారులు, పాలకులు



మెదన్‌పూర్ వద్ద మొరం రోడ్డు



కంకర తేలిన అంబుగామ రోడ్డు

కుంటాల: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని విధంగా మారింది కుంటాల మండలంలోని ఓలా–అంబుగామ బీటీ రోడ్డు దుస్థితి. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనా అధికారుల పర్యవేక్షణలోపం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా రెండేళ్లుగా రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం నెలకొంటోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు.

రెండేళ్ల కిందట ప్రారంభం..

మారుమూల ప్రాంతాలకు రవాణా సౌకర్యం మెరుగుపరిచేందుకు మండలంలోని ఓలా నుంచి అంబుగామ వరకు ఏడు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు ఏర్పాటుకు ఐటీడీఏ రెండేళ్ల కిందట రూ.కోటిన్నర నిధులు మంజూరు చేసింది. దీంతో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ రెండు కల్వర్టులు, కిలోమీటర్ మేర కంకర వేశాడు. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ రోడ్డు పనులు వదిలేశాడు. అధికారులు మరో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించినా ఆయన ఇప్పటివరకు ప్రారంభించలేదు.

రాకపోకలకు కష్టాలే..

ఓలా–అంబుగామ వరకు బీటీ రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు నరకయాతన పడుతున్నారు. అంబుగామ, మెదన్‌పూర్ నుంచి నిత్యం చదువుకునేందుకు ఓలా, కుంటాల, నిర్మల్, భైంసా ప్రాంతాలకు విద్యార్థులు వెళ్తుంటారు. రోడ్డు సరిగా లేక గ్రామాలకు ఆర్టీసీ బస్సులు రావడం లేదు.

ఏటా వర్షాకాలంలో ఇబ్బందులు

ఓలా శివాలయం వద్ద లోతట్టు వంతెన ఉండడంతో ఏటా వర్షాకాలంలో చిన్నపాటి వాన కురిసినా రాకపోకలు నిలిచి పోతున్నాయి. అధికారులు స్పందించి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

బస్సు రావడం లేదు



నేను కుంటాల వెళ్లి చదువుకుంటా. మా గ్రామం నుంచి ఓలా మీదుగా కుంటాల వెళ్లాలి. రోడ్డు సరిగా లేక మా గ్రామానికి ఆర్టీసీ బస్సు రావడం లేదు. ఇబ్బంది అవుతుంది.. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయించాలి.

– వైష్ణవి, విద్యార్థిని, అంబుగామ

త్వరగా పూర్తి చేయండి



మా గ్రామానికి రోడ్డు కోసం నిధులు మంజూరు చేశారంటే సంబురపడ్డాం. కానీ పనులు మధ్యలోనే నిలిపివేశారు. నిత్యం రాకపోకలు సాగించే విద్యార్థుల తోపాటు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. పనులను పూర్తి చేసి మా గోస తీర్చాలి.

– జాదవ్ శివాజీ, అంబుగామ

రోడ్డు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం

బీటీరోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రజలకు ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటాం. త్వరలోనే కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసేలా చూస్తాం.

– రఘు వంశీ, పీఆర్ ఏఈ

అన్నాభావు సాఠే బాటలో నడవాలి

- ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



సాఠే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

తానూరు: ప్రతి ఒక్కరూ సాహిత్యరత్న అన్నాభావు సాఠే బాటలో నడవాలని ముధోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన అన్నాభావు సాఠే జయంతిలో పాల్గొని మాట్లాడారు. దళితులు ఉన్నత చదువులు చదవి అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. అంతకు ముందు సాఠే చిత్రపటానికి పూలమాల వేసి జెండా అవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోతారెడ్డి, అన్నాభావు సాఠే కమిటీ తాలూక అధ్యక్షుడు ఉత్తం బాలేరావ్, పీఏసీఎస్ చైర్మన్ నారాయణ్‌రావ్ పటేల్, సర్పంచ్ విఠల్, శివాజీ పటేల్, పుండలిక్, రమేశ్, సోమ్‌నాథ్, చంద్రకాంత్ యాదవ్, పండరి, సురేశ్ , భీమ్‌పవార్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తానూరు తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏగా పని చేసే ఫీర్ హైమద్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే విఠల్ రెడ్డి పరామర్శించారు. బాధితులకు ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. వారి వెంట మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోతారెడ్డి, సర్పంచ్ విఠల్, ఆయా గ్రామాల కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

నర్సాపూర్(జి):మండలంలోని చాక్‌పల్లి పంచాయతీ పరిధిలోని పాత డొంగుర్గాం, కొత్త డొంగుర్గాం గ్రామస్తులు గురువారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. భైంసారూరల్ మండలం దేగాంలోని తన నివాసంలో కలిసి తమ గ్రామాలను నూతన పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

21న మహాధర్నాకు తరలిరండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భైంసారూరల్: హైదరాబాద్‌లో ఈనెల 21న తపస్ ఆధ్వర్యంలో జరిగే మహాధర్నాకు ఉపాధ్యాయులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నవీన్ అన్నారు. గురువారం భైంసా పట్టణంలోని విశ్రాంతి భవనం సమీపంలో మహాధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను వెంటనే చేపట్టి సీపీఎస్ రద్దు చేసి పాతపెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. 317 జీవో ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు సొంత జిల్లాలో అవకాశం కల్పించాలని కోరారు. గురుకులాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు ఇప్పించి.. కస్తూరిబాలో పని చేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు తపస్ నాయకులు జి.రాజేశ్వర్, అజయ్, చంద్రప్రకాశ్, ధీరజ్ కులకర్ణి, విఠల్‌రెడ్డి, బాపూజీ, సాయినాథ్, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

సీడీపీవోకు సన్మానం

ఖానాపూర్: స్వాతంత్ర దిన వేడుకల్లో మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అధికారి అవార్డు అందుకున్న ఐసీడీఎస్ సీడీపీవో సరితను పట్టణంలో అంగన్‌వాడీ టీచర్లు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గుడిసె సంపూర్ణ, వరలక్ష్మి, మంగమ్మ, లీల, చందురాణి, సుకన్య, చంద్రకళ, గంగరాజు, లక్ష్మి, విజయనిర్మల, సహజన్, సత్య తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ఖానాపూర్: మండలంలోని పాతఎల్లాపూర్, నడింపల్లె, గోసంపల్లె గ్రామాల్లో ఇటీవల పలువురు మరణించారు. గురువారం బాధిత కుటుంబాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరినాయక్ పరామర్శించారు. కార్యక్రమంలో ప్రకాశ్, కిష్టయ్య, లక్ష్మణ్, సదాశివ్, రమేశ్, రాజేశ్వర్, పుల్లయ్య, శంకర్, శేఖర్‌గౌడ్, రాజేందర్, ప్రవీణ్ తదితరులున్నారు.

ఆలయ చైర్మన్ కు సన్మానం

నర్సాపూర్(జి): దిలావర్‌పూర్ మండలంలోని కదిలే మతాన్నపూర్ణ పాపహరేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా నార్వాడే వెంకట్‌రావు పటేల్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు కొంద్ర రమేశ్, నర్సాపూర్ (జి) మండల కన్వీనర్ గోపిడి గంగారెడ్డితోపాటు పలువురు శాలువాతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎస్సైకి సన్మానం

లక్ష్మణచాంద: ఇటీవల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్‌ను పలువురు నాయకులు గురువారం పోలీస్‌స్టేషన్‌లో సన్మానించారు. కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గురాల లింగారెడ్డి, లింగారెడ్డి, గంగాధర్, షేర్ రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

సాయిబాబా ఆలయంలో పూజలు



దాతను సన్మానిస్తున్న చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రం సమీపంలోని శ్రీ గండి రామన్న ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం ప్రారంభం కావడంతో సాయిబాబా ఆలయంలో హారతి అర్చన, పూజ కార్యక్రమాలు చేశారు. అనంతరం భక్తులకు జిల్లా అటవీశాఖ అధికారి సునీల్–సంయుక్త హిరామత్ దంపతులు అన్నదానం చేశారు. వారిని ఆలయ ట్రస్ట్ చైర్మన్ లక్కిడి జగన్మోహన్‌రెడ్డి శాలువా, మొమెంటోతో సత్కరించారు. వేద పండితులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం సందడి నెలకొంది. భక్తులు హారతి కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

ఈ నీళ్లు తాగితే ఆసుపత్రికే..



జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ప్రజారోగ్య శాఖ కార్యాల యం ఎదుట భగీరథ పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి నెలరోజులుగా నీరంతా వృథాగా పోతుంది. ఇంటింటికీ సరఫరా అయ్యే ఈ పైపులైన్‌లో మురుగు నీరు కలుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రోగాల బారిన పడుతున్నామని.. అధికారులు లీకేజీకి మరమ్మతులు చేయించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

కాంగ్రెస్‌లో పలువురు చేరిక



కాంగ్రెస్‌లో చేరిన వారితో శ్రీహరి

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు గురువారం జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు నివా సంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈమేరకు ఆయన వారికి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. పొట్టపెల్లి(కే)కు చెందిన 30 బీజేపీ నాయకులు మాజీ సర్పంచ్ గుండం శ్రీనివాస్ ఆధ్వర్యంలో.. బాబాపూర్‌కు చెందిన తునికి నారాయణతోపాటు 20 మంది కార్యకర్తలు, నర్సాపూర్, కాశీగూడ గ్రామాలకు చెందిన 40 మంది యువకులు కాంగ్రెస్‌లో చేరారు. అట్ల రాంరెడ్డి, ఈటెల శ్రీనివాస్, రమేశ్, సాయన్న, నర్సయ్య, అజయ్, రజినీకాంత్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. కోతకు గురైన రోడ్డు



తానూరు: మండలంలోని ఉమ్రి(కే) నుంచి ఇలేగాం వెళ్లే మార్గంలో రోడ్డు కోతకు గురైంది. దీంతో వాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్నారు. అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టి.. సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి : జగదీశ్, పీఆర్ ఏఈ, ఫోన్: 91008 53882

పెండింగ్ కేసులు పరిష్కరించండి

- నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

పెంబి: పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం డీఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించి మాట్లాడారు. ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసులు విధి నిర్వహణలో ముందుండాలన్నారు. అనంతరం హరితహారంలో భాగంగా స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఖానాపూర్ సీఐ మోహన్, ఎస్సై రజినీకాంత్, సిబ్బంది ఉన్నారు.

'ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వొద్దు'



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

లోకేశ్వరం: ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన లంబాడాలకు ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వవద్దని నాయక్‌పోడ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సంగెం నర్సన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం లోకేశ్వరంలో తహసీల్దార్ మోతీరాంకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా నాయక్‌పోడ్ కులస్తులకు గృహలక్ష్మి పథకం కింద ఇళ్లను మంజూరు చేసి.. గిరివికాస్ పథకం వర్తింపజేయాలని కోరారు. అంతకుముందు నూతన తహసీల్దార్‌ను సంఘ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో నాయక్‌పోడ్ సంఘం మండలాధ్యక్షుడు గంజాల గంగాధర్, రాము, జగదీశ్ తదితరులున్నారు.

గ్రామాల్లో గృహలక్ష్మి సర్వే



ధర్మాజీపేట్‌లో ఇంటి స్థలం పరిశీలిస్తున్న సిబ్బంది



కనకాపూర్‌లో దరఖాస్తు పరిశీలిస్తున్న నసీరుద్దీన్

కడెం: మండలంలోని ధర్మాజీపేట్‌తోపాటు తదితర గ్రామాల్లో గృహలక్ష్మి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలిస్తున్నారు. దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాలను నమోదు చేసుకుంటున్నారు. సర్వే అనంతరం ప్రత్యేకాధికారులు మళ్లీ గ్రామాల్లో సర్వే చేసి.. దరఖాస్తుదారుడు అర్హుడా కాదా అనేది నిర్ణయిస్తారని ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు.

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ గ్రామంలో గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి ఎంపీవో నసీరుద్దిన్, సిబ్బంది పలు వివరాలు నమోదు చేసుకున్నారు. ఇంటిస్థలం, కులం, ఆదాయ సర్టిఫికెట్లు, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు పరిశీలించారు. వారి వెంట పలువురు సిబ్బంది ఉన్నారు.

కుంటాల: ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద అర్హుల నుంచి ఇటీవల దరఖాస్తులను స్వీకరించింది. గురువారం మండలంలోని ఓలా, కుంటాల, వెంకూర్ గ్రామాల్లో దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి అధికారులు పరిశీలించి పలు వివరాలు నమోదు చేసుకున్నారు. అధికారులు దేవేందర్‌రెడ్డి, రహీం, గట్టుపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వ్యాధులపై అవగాహన



గోసంపల్లిలో పాల్గొన్న సీహెచ్‌వో రాణి, సిబ్బంది



మాత్రలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె పంచాయతీ కార్యాలయంలో గురువారం ఫైలేరియా, కుష్టు వ్యాధులపై సబ్‌సెంటర్ సీహెచ్‌వో రాణి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. వ్యాధుల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సర్పంచ్ గంగారాం, నాయకులు, సిబ్బంది ధర్మరాజు, రాజశేఖర్, లావణ్య, వేరొనిక తదితరులు ఉన్నారు.

భైంసా: పట్టణంలోని సర్వేశ్వర విద్యామందిర్‌లో గురువారం ఆరోగ్య సిబ్బంది ఫైలేరియా మందులను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ కునాల్ ముందాడ, ఆశావర్కర్లు సులోచన, రసిక, సవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లిలో ఫైలేరియా(బోదకాలు) వ్యాధిపై గురువారం మండల ఆరోగ్య కార్యకర్త శివకృష్ణగౌడ్ అవగాహన కల్పించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ తీసి.. ప్రజలకు వ్యాధి లక్షణాలు, వ్యాధి వ్యాప్తి చెందే విధానం, చికిత్స గురించి వివరించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

లోకేశ్వరం: ఆమ్ ఆద్మీ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి కన్వీనర్ సయ్యద్ హైదర్ అన్నారు. గురువారం మండలంలోని రాజూర గ్రామంలో పార్టీ మండల కమిటీని ఎన్నుకున్నారు. పార్టీ మండల ఇన్‌చార్జి కన్వీనర్‌గా జిలకర చిన్నన్న, కోఆర్డినేటర్‌గా నమ్ముల్ల గంగాధర్, మైనార్టీ ఇన్‌చార్జి కన్వీనర్‌గా షేక్ ఖదీర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ముధోల్ అసెంబ్లీ ఇన్‌చార్జి కన్వీనర్ సూర్య నారాయణ, భైంసా పట్టణ ఇన్‌చార్జి కన్వీనర్ సయ్యద్ హుజుర్, పలువురు నాయకులు రవీందర్, సోఫ్రి అబుల్ వహీద్, అఖీఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.